

# సన్మానం

''రంగారెడ్డి సార్ సన్మానం సంగతేమైంది సార్.'' స్టాఫ్ రూంలో పేపర్ చదువుతున్న స్టాఫ్ సెక్రటరీ రామనాథంను ఉద్దేశ్యించి అడిగాడు క్రొత్తగా సర్వీసులోకి వచ్చిన టీచర్ సుధాకర్ రెడ్డి.

''గుమ్మిల, కందుల్ గుమ్మిల్నె ఉండాలే గాని పిల్ల దొడ్డుగ గావాలంటె అయితాది వయా?'' చక్కని మగత నిద్రలో హాయిననుభవిస్తున్న హిందీ పండితుడు యాదయ్య నుద్దేశించి చురక వేసే ప్రయత్నం చేసాడు రామనాథం.

యాదయ్యమనసు గాయ పడ్డది ''ఎవ్వడువయా పైసలియ్య నన్నది? ఎవ్వడెవ్వడు ఇచ్చిండు చెప్పు''? గయ్ మన్నాడు.

''అరె నీసంగతి గాదుబయ్ ఒగరొస్తమంటరు ఒగరు లేవంటరు. ఒగరు నూరంటరు- ఇంకొగరు నూటాయాభై అంటరు. ఏదో ఒకటి తై జేస్తేగదా జెల్ది జెయ్యనీకే, పెద్ద మనిషి తరహా వ్యవహారం రామనాథానిది.

''మీరెంత మంది నడిగిన్రు. ఎవ్వరెవ్వరియ్య లేదన్నరో చెప్పుండి ''. ఇదంత నీ ఆలస్యం తప్పు వేరుకాదన్న ధోరణిలో నిలదీశాడు క్రాఫ్ట్ టీచర్ గోవిందరావు.

''అరె, అడుగుడంటె ఒక్క నొక్కడ్ని బిచ్చమెత్తుతరా? ఒకసారి జెప్పినం అయిపాయె. వాళ్ళకు తెలవదా'', తనను తాను సమర్ధించునే ప్రయత్నం రామనాధానిది.

''ఏంటండీ తెలిసేది. పాపమాపెద్దాయన, రిటైర్డ్ఐ అప్పుడే రెండు రెండు వారాలవుతున్నది. ఇప్పటి కింకా నిర్ణయంకాలేదు. కార్యక్రమం గురించి ఒక మీటింగైనా లేదు. మీరు స్టాఫ్ సెక్రటరీగా ఉండి ఏం చేస్తున్నట్లు?

''వీడు సంతకం బెట్టలేదు. దావతియ్యాలి. వానిపేరు పేపర్లో వచ్చింది పార్టీగావాలి. వీడు టెలిఫోన్ బెట్టించు కున్నాడు స్వీటు దెప్పించాలి. అంటూ అడ్డమైన కాలక్షేపాలు జేయడానికొస్తుంది గాని రంగారెడ్డిగారి గురించి కనీసం ఒక్కసారైన అందరినీ పిలిచి మాట్లాడారా?'' మనుసులోని ఆవేదనను వెళ్ళగక్కాడు గ్రేడ్ 1 తెలుగు పండితుడు సాంబయ్య.

''అవును సార్! అసలు యాక్చువల్‌గా ఎవరైనా రిటైర్ అయితే రిటైరైన రోజే సన్మానం చేస్తారు. గదా.... పదమూడు రోజులైంది. ఇంకా మనం ప్లాన్ కూడా చేసుకోలేదు. '' సుధాకర్ రెడ్డి సాంబయ్యను సమర్థించాడు.

''అందరు చెప్పే మొనగాళ్ళే'' రామనాథం కోపం నసాశానికంటింది. ''చేసే పీకుడుగాడెవ్వడూ లేడు. క్లాసులల్ల ఫైనల్ వసూల్ చెయ్యమన్నంగద!, నీక్లాసుల యేపాటి జేసినవో చెప్పు.''

''అరె! మన స్కూల్ల పైనలేపాటి స్తరోనీకు దెలువదా ఏం ?''మనది ప్రభుత్వ పాఠశాల అని గుర్తు చేస్తూ అన్నాడు గోవిందరావు 'సగంమంది హాస్టల్ పిల్లలే వాళ్ళకు దోచినంత ఇస్తరు. ఇయ్యరుగూడా. అయితే ఫేర్‌వెల్ పార్టీ ఇయ్యరా?'' సుధాకర్ రెడ్డిని వెనకేసుకొచ్చాడు.

'' అందర్ నన్నే అనుండి వయా! మీరంత జేస్తమంటే నేను గాదన్ననా?'' రాజీకి వస్తూ రామనాథం.

''ముందు తారీకేదో తైజెయ్యండి. మనమెన్ని పైసలే సుకోవాలి. ఎవ్వరెవ్వర్ని పిలువాలి......... హెడ్మాస్టర్‌ను, కలసి మాట్లాడితె అయిపోతది గద'' ఇంకా ఆలస్యమెందుకు అన్నధోరణిలో ప్రోత్సహించాడు, అంతసేపు మౌనముద్ర వహించిన పి ఇటి ఏసుపాదం.

★ ★ ★

ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి ప్రముఖ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్రస్థాయి నాయకులను ప్రత్యేక అతిథులుగా, సబ్ కలెక్టర్ గారిని ముఖ్య అతిథిగా కార్య క్రమానికి ఆహ్వానించారు.

పూలమాలలూ రిఫ్రెష్ మెంట్స్ ఏర్పాట్లు పి.ఇ.టి.కి అప్పగించారు.

స్టేజి అలంకరణ, బ్యానర్లూ వగైరా గోవిందరావు చూసుకున్నాడు. సాంబయ్యకు సన్మాన పత్రం, కార్యక్రమం స్వరూపం, వ్యాఖ్యానం, సాంస్కృతిక అంశాలు నిర్వహించే బాధ్యత నిచ్చారు.

ఆహ్వాన పత్రాలు అతిథి మర్యాదలూ చూసుకునేందుకు భూలక్ష్మిని సుధాకర్ రెడ్డిని నిర్ణయించారు.

అసలు కార్యక్రమానికి మరో ఇరవై నాలుగ్గంటలే ఉండటంతో చివరిగా సమావేశ మయ్యారంతా.

''ఇంతకూ గిఫ్ట్ వచ్చేసిందా?'' అడిగాడు హెడ్మాస్టర్ ఆగమయ్య .

''ఐతున్నది సార్! సాయంత్రాని కిచ్చేస్తనని జెప్పిండు''. గోల్డ్‌స్మిత్‌చే రింగ్ తయారు చేయిస్తున్న విషయాన్ని చెప్పాడు రామనాథం.

జమాఖర్చులన్నీ లెక్కలు చేశారు, చూశారు. ''ఇంక ఐదువందలు తక్కువయ్యేటట్లున్నయి. ఎట్లజేతం సార్ ''. యాదయ్య అడిగాడు.

ఒక్కక్షణం నిశ్శబ్ద మలుముకున్నది. తర్వాత కలగా పులగంగా ఏవో మాటలు ''ఎట్లజేతమంటే ఏమన్నమాట వయా? ఇప్పటికి నూరు నూరిచ్చినం. పైసలేమన్న చెట్లకు గాస్తయా? ఉన్నదాంట్ల సరిపెట్టుండి''. ఏసుపాదం ఫైస్‌లా. కొంత తర్జన భర్జన తర్వాత దండలు,ఫోటోలు, రిఫ్రెష్‌మెంట్లు , ఏర్పాట్లలో నుండి కోతలు విధించి ఉన్నదాంట్లోనే అన్నీ సర్దుకునేందుకు నిర్ణయించారు.

''సన్మాన పత్రం ఒకసారి చదివి వినిపించమంటారా?'' సమావేశం చివర్లో సాంబయ్య ప్రతిపాదన.

''అ! ఏమవుసరం లేదు. ఏసన్మాన పత్రమైనా ఒక్కతీరే ఉంటది. గదంత ఇప్పుడెందుకు?'' ఏ అంశాన్నయినా ఒకేలా ఉపేక్షించే సైన్స్‌టీచర్ గాలయ్య చికాకు.

''చదవనీయండి సార్! ఇంతకూ ఏమేం రాశారో, అప్పుడు మా కసలు చూసే అవకాశం కూడా ఉండదేమో!'' భూలక్ష్మి పూర్వపక్షం.

''చదవండి, చదవండి అదెంత సేపు!'' అదేంభాగ్యం? అన్నట్టు హెడ్మాస్టరు అనుమతి.

గొంతు సవరించుకొని సాంబయ్య వినిపించడం ప్రారంభించాడు. 'సహృదయులు వదాన్యులు, స్వాతంత్ర్య సమర యోధులు '' సాంబయ్య చదువుతూనే ఉన్నాడు.

''వీడే స్వాతంత్ర్యంలో పాల్గొన్నాడు వయా?'', ఏసుపాదం ఈసడింపు ప్రశ్న గుస గుసగా బయట పడింది. సుగుణాకర్ వద్ద.

''యాడ్నన్న పాల్గొనిండొచ్చు అరె! గా టైంల జైలుకు పోయి నోళ్ళంతా స్వాతంత్ర్య సమర యోధులేసార్!'' క్లారిఫై చేసాడు సుగుణాకర్.

''ఒహో! గట్లనా!'' అంటూ బిగ్గరగా నవ్వాడు పి. ఇ. టి.

ఏర్పాట్లన్నీ అనుకున్న విధంగా జరిగిన సంతృప్తి ప్రకటిస్తూ అందరూ సెలవు తీసుకున్నారు.

★ ★ ★

సాయంత్రం మూడున్నర గంటలకు కావలసిన సమావేశం అతిథులు రాకపోవడంతో ఐదు ముప్పైదాకా ఆగాల్సి వచ్చింది.

వాళ్ళ రాకతో కార్యక్రమం ప్రారంభమైంది.

సాంబయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఒక్కొక్కరినీ వేదిక మీదకి ఆహ్వానిస్తున్నాడు.

అధ్యక్షులు, అతిథులు పైకి వచ్చారు.

''ఇప్పుడు ఈ వీడ్కోలు సమావేశంలో సన్మానం పొందబోయే పూజ్యులు శ్రీ రంగారెడ్డి గారు వేదికపైకి రవాల్సిందిగా ప్రార్థిస్తున్నాను. ''సభంతా చప్పట్లు మారు మ్రోగుతున్నాయి.

రంగారెడ్డి ఎక్కడా కనబళ్ళేదు మైక్ ఆఫ్‌చేసి కంగారుగా అడిగాడు సాంబయ్య

''రంగారెడ్డి సార్ ఎక్కడా?''

-ఇందాకే కనిపించారు''

''గీడే ఉండే''

''మూడు గంటలకు జూసిన నేను ''-- పాడి సమాధానాలు.

సభంతా గుసగుసలు - అల్లరి గందరగోళం.

సాంబయ్య మౌత్ పీస్ చెక్‌చేశాడు. ''విద్యార్థుల్లారా సైలెన్స్. శ్రీ రంగారెడ్డిగారు త్వరలో వస్తారు '' హెడ్మాస్టర్ వైపు తిరిగి, ''వచ్చేదాకా ఆగేదా సార్ !'' అన్నాడు.

'' ఏంటివయా ఆగేది? పెద్దమనుషుల్ని విలిసి గిదేంతరీక? అరె, సబ్ కలెక్టర్ సాబ్ వచ్చిండు. ఊళ్ళనే ఉండి. ఈటైముకు రానికేం రోగం? ప్రోగ్రాంకే టైముకు రానోళ్ళు, డ్యూటీలెంత బాగజేస్తరో తెలుస్తనే ఉన్నది. అందుకే మనకిజ్జత్ లేకుండావొయ్యింది. పిలిపియ్యండి. ఆ ముసలోడ్ని. అప్పటి దాంక ఆగుడెందుకు? షురూ జెయ్యండ్రి'' టీచర్స్ యూనియన్ ప్రెసిడెంట్ చిన్న ఉపన్యాస మిచ్చాడు.

''ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమౌతుంది.'' అనక తప్పలేదు సాంబయ్యకి.

ప్రార్థన మొదలైంది.

వచ్చిన వాళ్ళొక్కక్కరే మాట్లాడు తున్నారు. సంఘం ప్రధాన కార్య దర్శి, సంఘం గొప్పతనాన్ని, సాధించిన విజయాలను ఏకరువు పెడుతున్నాడు.

''సార్ రంగారెడ్డి సార్ ఇంటిదగ్గర లేరట'' పిలుచుకొని రావడానికెళ్ళిన విద్యార్థి సాంబయ్య చెవిలో చెప్పాడు.

అదే మాట హెడ్మాస్టర్ చెవిలో అలాగే చెప్పాడు సాంబయ్య.

'' మరెక్కడికెళ్ళిండో'' ఆగమయ్య, అయోమయం.

''ఏ బార్‌లో గూకున్నడో పొయ్యి సూడుండ్రి, పొండి '' ఎగతాళిగా నవ్వుతూ అన్నాడు హెడ్మాస్టర్ పక్కన కూర్చొని ఉన్న ఛోటా రాజకీయ నాయకుడు.

సబ్‌కలెక్టర్ గారు '' ఎవరి గురించి ఈ కార్యక్రమం జరుపుతున్నారో వారు ఈ కార్యక్రమంలో లేక పోవడం బాధాకరం. ప్రపంచంలోనే అత్యుత్తమమయిన ఉపాధ్యాయ వృత్తి పట్ల నాకెంతో గౌరవం. ఒక ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం చేసేందుకు నన్ను పిలిపించిడం నాకు ఎంతో ఆనందం కల్గించింది. కాని పరిస్థితి చూస్తే అంతా అయోమయంగా ఉంది. ఇక ముందైనా ఇలాంటి పరిస్థితి కల్గ కూడదని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను''.

ముక్తసరిగా మాట్లాడి కూర్చున్నాడు.

రసవంతంగా సాగుతుందనుకున్న కార్యక్రమం నీరసంగా ముగింపు దశకు చేరుకుంది. వందన సమర్పణ కోసం మైక్ దగ్గరికి వెళ్తున్న సాంబయ్య దగ్గరికి ఒక ఆగంతుకుడు పరిగెత్తుకునిన వచ్చి '' రంగారెడ్డి సార్ ఈ లెటర్ మీకివ్వమని పంపించాడు సార్'' అంటూ ఇచ్చాడు.

''సర్! రంగారెడ్డిగారు లెటర్ పంపించారు సార్.'' హెడ్‌మాస్టర్‌తో అన్నడు సాంబయ్య. ''కనీసం అదైనా చదవండి'' సాంబయ్య మాటలు విన్న సబ్ కలెక్టర్ గారు కల్పించుకున్నారు.

ఉత్సాహంగా మైక్ అందుకుని ''ప్రియమైన విద్యార్థులారా! శ్రీ రంగారెడ్డిగారు అవి వార్య కారణాల వల్ల చివరి క్షణంలో ఇక్కడికి రాలేక పోయారు. వారు పంపించిన లేఖను ఈ సందర్భంగా చదివి మీకు వినిపిస్తాను''.

సభ అంతా చప్పట్లు.

చదవడం ప్రారంభించాడు సాంబయ్య '' సభకు విచ్చేసిన పెద్దల కందరికీ నా నమస్కారాలు! ప్రియమైన చిరంజీవులకు ఆశీస్సులు!........'' ఆగిపోయాడు సాంబయ్య.

''సదువు- సదువు '' ఆగిపోయావేం అన్నట్లు హెచ్చరించాడు ఓ అతిథి

''చదవండి సార్!'' సభలో నున్న పూర్వ విద్యార్థుల నుండి ఎవ్వరో అన్నారు.

తప్పని సరై మొదలు పెట్టాడు సాంబయ్య'' నేను చచ్చిపోయాను అవును పదవీ విరమణ చేయడంతోనే ఉపాధ్యాయుడుగా చచ్చిపోయాను.'' సాంబయ్య ఆపాడు.

''యు ప్లీజ్ కంటిన్యూ......'' సబ్ కలెక్టర్ అనునయిస్తూన్నట్లు అన్నాడు.

''నేను, స్వాతంత్ర్య సమరయోధుడ్నేమిటని, సహచరులే నా ప్రక్కన విమర్శిస్తుంటే చచ్చిపోయాను.''

''జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైనప్పుడు' డబ్బులిస్తే కాకాలు పడ్తే ఎవరైనా ఉత్తమోపాధ్యాయులే' - అని నా సోదరులే చాటు మాటుగా అనుకుంటుంటే విని చచ్చిపోయాను.

''నాకు వీడ్కోలివ్వడం ఒక భారమై తోటి వాళ్ళు చందాలేసుకోవడానికి దెబ్బలాడుకున్నారని తెలిసి చచ్చిపాయాను.

''నాకున్న పంక్చువాలిటి అనే చాదస్తపు దురలవాటుతో మీరు చెప్పిన సమయం కంటె అరగంట ముందే వచ్చి కూర్చుంటే రెండుగంటల సేపు కనీసం పలకరించే వాళ్ళు లేక చచ్చిపోయాను.

''ఇలా ఎన్నోసార్లు చచ్చిపోయిన నేను ఇంకా చచ్చే ఓపిక లేక మీ సన్మానానికి రాలేదు. దయచేసి క్షమించాల్సిందిగా అందరినీ ప్రార్థిస్తున్నాను.

''నిజానికి ఇంతకు మించిన సన్మానం నాకెప్పుడో జరిగింది.

''జైల్లో కె.వి రంగారెడ్డిగారు నన్ను కౌగలించుకొని,-'ఇంత చిన వయసులో ఉద్యమంలో ఇంత యాక్టివ్‌గా పనిచేస్తున్నందుకు మనసారా అభినందిస్తూన్నా'' నన్నప్పుడు నాకు మొట్టమొదటి సన్మానం జరిగింది.

''సార్! మీ చేత దెబ్బలు తిని తినీ లెక్కలు నేర్చుకున్న సూరిగాడ్ని సార్! ఇప్పుడింజనీర్‌గా పని చేస్తున్నా'' నని కోఠీ బస్ స్టాప్‌లొ సూట్‌లో ఉన్న ఓ యువకుడు సురేష్ ,పాదాభివందనం చేసినప్పుడు ఇంత కంటే పది రెట్ల సాన్మానం పొందాను.

''అనారోగ్యంతో అవస్థపడుతున్న నన్ను చూసి వంతుల వారిగా పోటీపడి నాకు విద్యార్థులు సేవ చేసినప్పుడు దీని కంటె వందరెట్లు సన్మానం పొందాను.

''ఇక్కడికి ట్రాన్ఫ్సర్ కాక ముందు రాంపూర్‌లో ఇల్లిల్లూ తిరిగి పిల్లల్ని చేరదీసి, ప్రాథమిక పాఠశాలకు కూడా దిక్కులేని స్థితిని ఉన్నత పాఠశాల స్థాయికి ఎదగ దీసినందుకు నా ట్రాన్స్‌ఫర్ను ఆపలేక కళ్ళనీళ్ళు పెట్టుకున్న గ్రామ ప్రజల్ని చూసి ఇంతకంటె వెయ్యిరెట్ల సన్మానం పొందాను.

''సార్ మీలాంటి మంచి టీచర్ ఊరికొక్కరుంటే భావితరం తప్పక ఉత్తమ పౌరులు అవుతారని మా పాఠశాలను దర్శించిన కలెక్టర్ గారు

అన్నపుడు ఇంతకంటె లక్ష రెట్లు సన్మానం పొందాను.

'' అందుకే అసలైన సన్మానాల నందుకొన్న నా మనసు ఈ ఆడంబరాలు జీర్ణించుకోలేక పోతోంది. దయచేసి నన్ను క్షమించండి.''

ఏకబిగిన ఉత్తరం చదివిన సాంబయ్య తర్వాత మాట్లాడబోయే విషయం మరచి పోయాడు.